కథానిక

# చైన్ రియాక్షన్!

పి. హైమవతి





తన ఆడబడుచు పుట్టింటికి వచ్చిందంటే చాలా భయం శ్రీప్రియకి. అలాగని ఆమెకి అత్తగారి మీద కోపం, ద్వేషం అసహనం ఉన్నాయనుకోడానికి వీల్లేదు.

శ్రీప్రియ తెలివైనది. చదువుకున్నది. ప్రపంచపు రీతిని చక్కగా అర్థం చేసుకున్నది.

ఆమె భర్తని ప్రేమగా చూస్తుంది. అత్త మామల్నిఎంతో ఆదరంగా చూస్తుంది. మరుదుల్ని ఆప్యాయంగా చూస్తుంది. ఆడబడుచుని ఎంతో గౌరవిస్తుంది.

కాని-

ఆడబడుచు సరస్వతికి పెళ్ళి చేసిపంపేసి వాళ్లు సంవత్సరాలైనా ఆమె మొగుడి గొంతెమ్మ కోరికలు ఇంకా ఇంకా పెరుగుతున్నాయే తప్ప, తగ్గడం లేదు.

శ్రీప్రియ మామగారు రిటైరై పోయారు. మరుదులు ఇంకా చదువుకుంటున్నారు. మామగారి కొచ్చే పెన్షన్, భర్తకొచ్చే జీతం వీటితోటే సంసారం నడవాలి. అందునా పట్నంలో సంసారం రోజు రోజుకీ పెరుగుతున్న ఖర్చులు, అదుపు తప్పిన ధరలు, చాలీ చాలని జీతం...

పెళ్ళైన నాలుగేళ్ళలో ఆమె ఆడబడుచు పదిసార్లు పుట్టింటికి వచ్చింది. ఆమె పుట్టింటికి రాకూడదని శ్రీప్రియకి ఏ కోశానా లేదు. తానూ పుట్టింటికి వెడుతూనే ఉంటుంది. వెళ్ళినపుడల్లా ఆమె అన్నగారు చీర పెడతాడు.

"ఎందుకురా అన్నయ్యా ఈ ఖర్చు.ఏదో నీ మీద ప్రేమతో చూసి పోదామని వస్తాను. నీ తృప్తి కోసం ఓ జాకెట్ గుడ్డ పెడితే సరిపోతుంది" అంటుంది శ్రీప్రియ.

"ఇందులో నాదేం లేదు. ఇదంతా మీ ఒదిన ఆలోచన" అంటాడు అన్నగారు.

తనకి అంత మంచి ఒదిన ఉన్నందుకు శ్రీప్రియ ఎంతో గర్వపడుతోంటుంది.

ఆమెకు చిన్నప్పుడే తండ్రి పోయాడు. కాలేజీలో చదువుకుంటుండగా తల్లి పోయింది. ఆమె పెళ్ళి అన్నగారే చేశాడు. ఆ పెళ్ళి చెయ్యడానికి ఆర్థికంగా తనెంత అవస్థ పడ్డాడో ఆమెకు తెలుసు...

తన ఒదిన తన మీద చూపించే ఆప్యాయత తన ఆడబిడ్డ మీద తాను కూడా చూపించాలని ఆమె ఆలోచన. కాని ఆడబిడ్డ మొగుడి ఆశకి హద్దు లేదు. తన సరదాలన్నీ అత్తవారి ఖర్చు మీద తీర్చేసుకోవాలని అతని దురాశ. పండక్కి వాచీ అడిగాడు. మరు పండక్కి సైకిలడిగాడు. ఇంకోసారి టూ-ఇన్-వన్ అడిగాడు. మరోసారి గ్యాస్ అడిగాడు. మరోసారి ఇంకొకటి, మరోసారి...

ఇవి కాకుండా నాలుగేళ్ళలో రెండు పురుళ్ళు పోసారు. ఆడపిల్ల పెళ్ళి చేస్తే బాధ్యత తీరుతుందనుకుంటారు. కాని, బాధ్యతలు పెరిగాయి. మొగుడి సంపాదన, మామగారి జీతం సరిపోవడం లేదని శ్రీప్రియ చిన్న ఉద్యోగం కూడా చేస్తోంది.

ఏదో రకంగా ఆడబిడ్డకి దోచిపెట్టడమే సరిపోతోంది. తనకీ పిల్లలు ఎదుగుతున్నారు. వాళ్ళ అవసరాలు పెరుగుతున్నాయి. వాళ్ళకి మంచి చదువులు చెప్పించాలని, మంచి బట్టలుకుట్టించాలని ఆమెకుంటుంది. కాని ఎలా? కాస్త చెయ్యి కూడదీసుకునే సరికి చెయ్యి విరిగి పోయే ఖర్చు.

ఇంతకీ జరిగిందేవిటంటే-

శ్రీప్రియ ఆడబడుచు మళ్ళీ పుట్టింటికి వచ్చింది. ఆమె ఆటో దిగుతుంటే చూసిన తండ్రి గుండెల్లో లారీలు పరుగెత్తాయి. గెడ్డం చేసుకుంటున్న అన్నగారికి గెడ్డం తెగి, రక్తం ఉబికింది. కేటరాక్ట్‌తో బాధపడుతున్న తల్లికి కళ్ళు పూర్తిగా కనబడ్డం మానేశాయి. స్టౌమీద పెడుతున్న పాలగిన్నె శ్రీప్రియ చేతిలోంచి జారి కింద పడిపాలన్నీ ఒలికిపోయాయి.

ఇల్లంతా కకావికలం అయిపోయింది. కొంత సేపు భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది.

లోపలికి వచ్చి అందర్నీ మామూలుగా పలకరించింది. అందరూ భయం భయంగా నవ్వారు. ఆమె మొగుడు పంపిన ఏ బాంబు మనసులోంచి తీసి తమగుండెల మీద పేలుస్తుందోనని అంతా భీతావహులై చూస్తున్నారు.

సాయంత్రం దాకా సరస్వతి ఏ బాంబూ పేల్చలేదు. కాని-

సాయంత్రం-

ఢాం!

అయిదువేల మెగాటన్నుల బాంబు పేలింది.

"అమ్మా- మరేమో ఆయన..."

"ఏవంటాడే?" భయము, కోపమూ, చిరాకు కలగలిపి అడిగింది.

"ఆయనతో పనిచేసే వాళ్ళందరికీమెళ్ళో గొలుసులున్నాయట- ఆయన కూడా బంగారపు చైన్ చేయించుకుంటారట."

"అందుకని?"

"అందుకని అయిదువేల రూపాయిలు పట్టుకురమ్మన్నారు?"

"పైగా..."

"ఊ..."

"అయిదు వేల రూపాయిలు తీసుకు రాకుండా వస్తే గుమ్మం దాటి రానివ్వనన్నారు."

ఆమె తల్లికి దుఃఖం ముంచుకొచ్చింది. కళ్ళలోకి నీళ్ళుబికాయి. ఆడబడుచుమాటలు వింటున్న శ్రీప్రియకి కోపం ముంచుకొచ్చింది. మొహంలోకి రక్తంఉబికి వచ్చింది.

సాయంత్రం భర్త ఇంటికొచ్చాక శ్రీప్రియ తను విన్న విషయమంతా చెప్పింది.

రెండురోజులు ఆ ఇంటిలో భయంకరమైన నిశ్శబ్దం తాండవించింది. ఏ ఇద్దరు మనసులు విప్పి మాట్లాడుకోలేదు. ఎవరూ నవ్వలేదు యాంత్రికంగా పనులన్నీ జరిగిపోతున్నాయి.

రెండు రోజులు పోయాక "ఏమ్మా- ఏం చేద్దామే?" అనడిగింది సరస్వతి. "ఏవండీ మరేం చేద్దాం?" అని ఆమె భర్తనడిగింది. ఆయన కొడుకు నడిగాడు. అతను శ్రీప్రియ నడిగాడు.

మరో మూడు రోజులు తర్జన భర్జన లయ్యాక చివరికి అంతా కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు.

అయిదు వేలు కావాలి-

ఒకటి, రెండు కాదు- అయిదు వేలు-

అయిదువేల రూపాయిల- ఖరీదు చేసే గోల్డ్ చైన్ లేకపోతే సరస్వతితో ఆమె మొగుడు కాపురం చెయ్యడు. అంటే అయిదు వేలు ఇస్తే గాని సరస్వతి కాపురానికి వెళ్ళదు.

అంచేత అర్జంటుగా అయిదువేలుకావాలి.

అంత డబ్బు అప్పుగా నైనా పుట్టించే మార్గం లేదు.

ఎలా? ఎలా?

"శ్రీప్రియ పుట్టింటికెళ్ళి అన్నగారి నడిగి అయిదువేలు తెస్తుంది. కాదు తేవాలి. అయిదువేలు లేకుండా వస్తే దాన్ని గుమ్మం ఎక్కనివ్వను. ఇంతకు మించి వేరే దారిలేదు" శ్రీప్రియ మొగుడి ఖచ్చితంగా చెప్పేశాడు.

శ్రీప్రియకి కళ్ళనీళ్ళొచ్చాయి. ఆమెకే కాదు- ఆమె అత్తమావలకి, భర్తకి కూడా కళ్ళనీళ్ళొచ్చాయి. కాని కళ్ళనీళ్ళు అయిదు వేల రూపాయిలని పుట్టించలేవు.

కాబట్టే మర్నాడుదయమే శ్రీప్రియ పుట్టింటికి వెళ్ళింది. హఠాత్తుగా ఆమె పుట్టింటి కొస్తే అన్నగారు, ఒదిన గారు ఆశ్చర్యపోయారు. తీరిగ్గా ఆరోజు సాయంత్రం విషయమంతా చెప్పింది. చెప్పి ఏడ్చింది. వలవలా ఏడ్చింది. అది చూసి ఆమె అన్నయ్య ఏడ్చాడు. అది చూసి ఆమె ఒదిన మాధవి ఏడ్చింది.

"సరే- నేను మాత్రం ఉన్నపళంగా అంత డబ్బు ఎక్కడ తేను. రేపే మీ ఒదిన్ని పుట్టింటికి పంపేస్తాను. అయిదువేలతో వస్తే సరి లేకపోతే గుమ్మం ఎక్కనివ్వను" అన్నాడు.

మర్నాడు మాధవి పుట్టింటికి వెడుతుంటే చూడలేక శ్రీప్రియ లోపలగదిలో మంచం మీద పడుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

* * *

"ఏమ్మా- ఒక్కదానివి వచ్చావు. అల్లుడు రాలేదా?" మాధవి చేతిలో సూట్‌కేసు అందుకుంటూ తండ్రి అడిగాడు. మాధవి ఏమీ మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళింది.

ఆ సాయంత్రం మాధవి తల్లిని, తండ్రిని, ఇద్దరు అన్నగార్లనీ, ఇద్దరు ఒదినల్ని హాల్లోకి పిల్చి- సరస్వతి మొగుడు మెళ్ళో చైన్ కోసం అయిదు వేలు తెమ్మని సరస్వతిని పుట్టింటికి పంపెయ్యడం, ఆ డబ్బు ఇవ్వలేని సరస్వతి అన్నగారు శ్రీప్రియని డబ్బు తెమ్మని పుట్టింటికి పంపెయ్యడం, శ్రీప్రియకి అంత డబ్బు ఇవ్వలేని తన భర్త తనని పుట్టింటికి పంపెయ్యడం-

అంతా పూసగుచ్చినట్లుగా చెప్పింది.

అంతావిని "మేం మాత్రం అంత డబ్బు ఎక్కడ తేగలం? అదే పద్ధతి ప్రకారం నేనూ, తమ్ముడు మా పెళ్ళాల్ని కూడా పుట్టిళ్ళకు పంపేస్తాం. చెరో రెండున్నర వేలు తీసుకొస్తే గుమ్మంలోకి రానిస్తాం" అన్నాడు మాధవి పెద్దన్నగారు.

మాధవి రెండో అన్నగారు సరేనన్నాడు.

ఆ ఇంటి పెద్దకోడలు పుట్టింటికి వెళ్ళడానికి పెట్టె సర్దుకుంది గాని చిన్న కోడలు అలాంటి ప్రయత్నం ఏమీచెయ్యలేదు. పైగా బజరు కెళ్ళి అయిదు లీటర్ల కిర్సనాయిలూ, కొత్త అగ్గిపెట్టె తెచ్చింది.

ఇంట్లో గ్యాస్, స్పేర్ సిలిండరూ ఉన్నాయి. కరెంటు కోత లేదు. కిర్సనాయిల్ ఎందుకు తెచ్చిందో అర్థం కాలేదు. ఆలోచించగా ఆలోచించగా భర్తకి విషయం అర్థమయింది.

"కిర్సనాయిల్ పోసుకుని వళ్ళు కాల్చుకుంటానని బెదిస్తున్నావా? ఈ పప్పులేం ఉడకవ్- వెళ్ళి రెండు వేల అయిదొందలు తేవల్సిందే" అన్నాడు.

"అందుక్కాదు."

"మరెందుకు?"

"నన్ను పుట్టింటికెళ్ళి డబ్బు తెమ్మని ఎవరు బలవంత పెట్టినా కిర్సనాయిల్ పోసి తగలబెడతాను" అంది తాపీగా-

అంతా భయపడ్డారు.

విషయం చెప్పి ఆ కిర్సనాయిల్ డబ్బా మాధవికిచ్చి మొగుడి దగ్గరకి పంపేసారు.

ఆమె ఆ డబ్బా శ్రీప్రియకిచ్చి ఆమెని అత్తారింటికి పంపింది. శ్రీప్రియ ఆ డబ్బా సరస్వతికిచ్చి మొగుడి దగ్గరికి పంపింది.

సరస్వతి మొగుడు అత్తవార్ని ఇంకెప్పుడూ అయిదువేలు కాదుకదా అయిదు రూపాయిలు కూడా అడగలేదు!!

## చేరాతలు

# పరిశోధకుల్లో నాగరిక ప్రవర్తన ఉండటానికి వీల్లేదా?

భాషా శాస్త్రంలో పరివర్తన సిద్ధాంతం అని ఒకటుంది. దాన్ని నో అమే ఛామ్‌స్కీ అనే శాస్త్ర వేత్త ప్రతిపాదించినట్టుగా చెపుతారు. కానీ సుమారు రెండు దశాబ్దాల పాటు (1957-1977) వివిధ దేశాల భాషా పరిశోధకులు వివిధ భాషల మీద చేసిన పరిశోధనల ఆధారంగా ఈ సిద్ధాంతం పటిష్ఠమైందనేది చారిత్రక వాస్తవికత. జాన్ రాబర్ట్ రాస్ అనే వీళ్ళలో ఒక ప్రముఖుడు. ఆయన Constraints on Varia bles in Syntax అనే సిద్ధాంత గ్రంథం రాశాడు. అందులో చాలా కొత్త ప్రతిపాదనలు చేశాడు. పరివర్తన సూత్రా లను బహు శక్తి వంతంగా తయారు చేస్తే అవి అతి విస్తారంగా ప్రవర్తించి వ్యాకరణ సమ్మత వాక్యాలతో పాటు వ్యాకరణ విరుద్ధమైన వాక్యా లను కూడా నిష్పాదన చేస్తుంది. అందువల్ల వాటికి కొన్నిటికి కొన్ని కళ్ళేలు తగిలించాలి. అటువంటి కళ్ళేల సమూహమే రాస్ సిద్ధాంత గ్రంథం.

అయితే అదే సమయంలో అదే మార్గంలో చాలా మంది పరిశోధకులు అటువంటి కళ్ళేల నమూనాల కోసం శ్రమిస్తున్నారు. అట్లాంటి వాళ్ళల్లో Ronald Langacker అనే ఆయన ఇంకో ప్రముఖుడు. ఆయనా ఇట్లాంటి కళ్ళేలనే తయారు చేస్తున్నాడు.

వీరిద్దరూ తయారు చేసిన కళ్ళేలలో ఒకచోట పోలిక కనిపించింది. ఒకే విషయం మీద కృషి చేస్తున్న పరిశోధకుల ఫలితాల్లో కొంత సామ్యం ఉండటం సహజం. ఆ రోజుల్లో భాషా శాస్త్రం మీద జరిగే పరిశోధనలకు అచ్చులో ఉన్న పత్రికలు చాల లేదు. వాళ్ళ పరిశోధనలు విడివిడి పత్రాలుగా కాపీలు తీయించి తోటి పరిశోధకులకు పోస్టులో పంపే వారు. వాటికి యూనివర్సిటీలు తగిన వసతులు కల్పించేవి. తమ పరిశోధన ఫలితాలను విశేషాలను తోటి పరిశోధకులకు అందించటం, అభివృద్ధికి దోహదం చేయటం, అదే విషయాన్ని ఆలంబనం చేసుకొని కొత్త విషయాలు ఆలోచించటానికి ఈ రకమైన ఇచ్చి పుచ్చుకోటాలు అవసరం. ఈ రకమైన విజ్ఞాన వ్యాప్తి 1960, 1970 దశాబ్దాల్లో విరివిగా జరిగింది.

భాషా శాస్త్ర చరిత్రలో ఇదో కబం గాదు కాలం! ఇంతకీ రోస్ చెప్పిన విశేషమేమిటంటే తానూ, లాంగే కరూ, యాదృచ్ఛికంగా ఒకే విషయాన్ని కనుక్కున్నామనీ, అయితే లాంగేకరు చెప్పింది తన దాని కన్నా బాగుందనీ, అందు వల్ల తాను దాన్నే అనుసరించ దల్చుకున్నాననీ! తన పద్ధతిని Bounding అనీ, లాంగేకరు గారి పద్ధతిని Command అనీ అంటారు. రోస్ తన మాటల్లో ఏమన్నాడో చూడండి.

> "Langacker's
> notion is, tens,
> clearly preferable,
> and it, not the notion
> of bounding, should
> be a part of the
> theory of language."

ఈ ఉదంతం వల్ల ఒక పరిశోధకుడికి మరో పరిశోధకుడి పట్ల ఉండ వలసిన సుహృద్భావం వెల్లడి అవుతుంది.

నేను ముందు చెప్పానంటే నేను ముందు చెప్పానని కొట్లాడుకోటం మన దేశంలో పరిశోధకుల మధ్య కనిపిస్తున్నది.

చాలా పూర్వం నేను భాషా శాస్త్రంలో ఒక వ్యాసం రాశాను. ఆ వ్యాసాన్ని ఒక సీనియర్‌కి చూపించాను. ఆయన వెంటనే తన పాత వ్యాసాన్నొకటి లాగి 'ఇదిగో చూడు, నేను ముందే చెప్పాను. కోట్ చెయ్యి' అన్నాడు. అట్లాగే చేశాను. అదే సీనియర్ నాతో చర్చిస్తూ ఒక విషయం మీద తన పూర్వపు అభిప్రాయాలు మార్చుకున్నాడు. కాని తాను మార్చుకోటానికి కారణ భూతమైనఅంశాన్ని గాని సంఘటనను కాని ఎక్కడా పేర్కొన లేదు. తాను మొదట చెప్పానన్న విషయాన్ని నా దృష్టికి తీసుకు రావటానికి అంత త్వరపడ్డ సీనియర్‌కి అదే నీతిని తనూ పాటించాలన్న విషయం విస్మరించాడు.

ఒకాయన కొన్ని ఏండ్ల కిందట (దశాబ్దాల కిందట) ఒక తెలుగు వాచకం తయారు చేశాడు. అదేమంత గొప్ప పుస్తకం అని నేననుకోను. అయినా అది ఎవరు తస్కరిస్తారో అని ఆయన వద్ద పాట్లు ఒక తెలుగు వాడు చెప్పగా విని ముక్కు మీద వేలేసుకున్నాను.

ఒక పరిశోధకుడు తాను ప్రజల దగ్గర్నుంచి సేకరించుకున్న సమాచారాన్ని మరో పరిశోధకుడికి అవసరం నిమిత్తం అందించాడు. రెండో పరిశోధకుడు చేసిన 'పొరపాటు' ఏమిటంటే ఆ 'టెక్స్ టే' అచ్చేశాడు. అయితే దానితో వ్యాపారం చెయ్యలేదు. ఆ విషయంలో ఆ ఇద్దరి పరిశోధకులకూ జరిగిన వాగ్వివాదం చెవులారా విన్నాను. విస్తుపోయాను.

ఇటీవలే అంటే చాలా ఇటీవల ఒక సీనియర్ పరిశోధకుడు ఒక పరిశోధక డాక్టరును వాకబు చేసి అతను సేకరించిన, విశ్లేషించి విశ్లేషించిన విషయాలను గురించి మాట్లాడాలన్నాడు. అయితే అతను చేసిన పొరపాటు ఏమిటంటే తమసంభాషణ 'టేప్' చేస్తానన్నాడు. ఇంకేం, ఈ డాక్టరు గారు భయపడి 'సారీ' చెప్పేశాడు.

పరిశోధన విషయాలు అదేదో ఆస్తి లాగా ఎందుకనుకొంటున్నారు? ప్రైవేటు ఆస్తికి ప్రాధాన్యం ఇచ్చే పెట్టుబడి దారీ వ్యవస్థలో లేని జాడ్యాలు మన వాళ్లని ఎందుకు పీడిస్తున్నాయి? ఇందుకు ఎవరు కారణం వ్యక్తులా? వ్యవస్థా?

ఈ పైన పేర్కొన్న సంఘటనల్లో పేర్లు చెప్పలేక పోయినందుకు చాలా విచారిస్తున్నాను వారు లబ్ధప్రతిష్ఠులు. నాకు సన్నిహితులు కూడా.

పరిశోధనలో ఇంతకన్నా నాగరికంగా ఉండలేమా? ఇతర దేశాల మేధావులకీ మన మేధావులకీ ప్రవర్తనలో ఇంత బేధం ఉండాలా?

ఎవరికి ఆత్మ పరిశోధన చేసుకోవాల్సిన విషయాలివి.